

దుమ్ముగూడెం మండలం చిన్నగుబ్బలమంగి ప్రాజెక్టు అలుగు పడి ప్రవహిస్తున్న వరద

# వర్షం.. వరద



చర్ల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తాలిపేరు ప్రాజెక్టులో నీరు

- భద్రాద్రి జిల్లాలో మత్తడి పోస్తున్న చెరువులు, కుంటలు
- ఎగువ వరదతో పొంగి ప్రవహిస్తున్న తాలిపేరు, కిన్నెరసాని
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షం భద్రాద్రి జిల్లాను వదలడం లేదు. ముసురుతోపాటు కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు పడుతుండడంతో చెరువులు, వాగులు, చెక్‌డ్యాంలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీనికితోడు ఎగువనున్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వస్తున్న వరదతో తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరగా.. భద్రాచలం వద్ద గోదావరి క్రమేపీ పెరుగుతున్నది. వరదలతో భద్రాచలం పరిధిలో ఏపీ రాష్ర్టానికి రాకపోకలు నిలిచిపోయాయి. అశ్వారావుపేట మండలంలో కురిసిన భారీ వర్షానికి ఇల్లు కూలిపోయింది.

### పొంగుతున్న వాగులు.. మత్తడి పోస్తున్న చెరువులు

టేకులపల్లి మండలంలోని రోళ్లపాడు, చంద్రయ్య కుంట, పరిక వాగు, లచ్చగూడెం వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులన్నీ మత్తడి పోస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలతోపాటు పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. కిన్నెరసాని, ముర్రేడు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇల్లెందులో వాగులు పొంగుతున్నాయి. సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు అలుగు పారుతుండగా.. కట్ట బీటలు వారింది. లక్ష్మీదేవిపల్లి మండలంలో చెరువులన్నీ మత్తడి పోస్తున్నాయి. చుంచుపల్లిలో ఎర్రచెరువు మత్తడి పోస్తుంది. మణుగూరు, అశ్వారావుపేట మండలాల్లో చెరువులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు చెప్పడంతో చెరువులకు గండ్లు పడే అవకాశాలు ఉన్నట్లు అధికారులు ముందస్తుగా అప్రమత్తమయ్యారు.

### తాలిపేరు, కిన్నెరసానికి వరద పోటు..

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కిన్నెరసాని ప్రాజెక్టులోకి వరద నీరు చేరింది. దీంతో అధికారులు గేట్లు ఎత్తి 13 వేల క్యూసెక్కుల నీటి దిగువకు విడుదల చేశారు. తాలిపేరు రిజర్వాయర్ 24 గేట్లు ఎత్తి లక్షా 40 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. దీంతో భద్రాచలం వద్ద క్రమేపీ వరద ప్రవాహం పెరుగుతుంది. ప్రస్తుతానికి భద్రాచలం వద్ద 28.2 అడుగుల మేర నీటిమట్టం చేరింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

### జిల్లా అంతటా వర్షాలు

నాలుగు రోజులపాటు భద్రాద్రి జిల్లాకు హై అలర్ట్ ప్రకటించగా.. వర్షాలు కూడా అదే స్థాయిలో కురుస్తున్నాయి. అశ్వారావుపేటలో 19 మిల్లీమీటర్లు, దుమ్ముగూడెం 14, కరకగూడెం 15, ములకలపల్లి 14, అశ్వాపురం 13, ఆళ్లపల్లి 9.5, గుండాల మండలంలో 8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రాత్రికి కూడా వర్షం కురిసే సూచనలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

# అల్లాడుతున్న ఖమ్మం

## భారీ వర్షాలతో జిల్లా ప్రజలు విలవిల

- మున్నేరు వరద బాధితుల జీవితాలు చిన్నాభిన్నం
- ఇప్పటికీ భయం.. భయంగా బతుకుతున్న వైనం
- ఆగని వానలు.. పొంచి ఉన్న మరో ముప్పు
- దినదిన గండంగా నిరుపేదల పరిస్థితి
- పంటలు నష్టపోయి కన్నీళ్లు పెడుతున్న రైతులు
- వరద ముంపు ప్రాంతాల్లో పూర్తికాని సర్వేలు
- ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూపులు
- పూర్తిస్థాయిలో మెరుగుపడని పారిశుధ్యం



ఖమ్మం కాల్వొడ్డులో వరదకు పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లు



ఖమ్మం కాల్వొడ్డులో వరదకు పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లు

ఖమ్మం, సెప్టెంబర్ 9 : ఖమ్మం జిల్లా ప్రజలు అల్లాడిపోతున్నారు. జిల్లావ్యాప్తంగా గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనం విలవిలలాడుతున్నారు. వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఖమ్మం నగరంలోని మున్నేరుప్రాంత ప్రజల బతుకులు వరదల వల్ల అతలాకుతలమయ్యాయి. ఇక రైతుల పరిస్థితి వర్ణణాతీతం. చేలల్లో, మెట్ట భూముల్లో ఇసుక మేటలు వేయగా, పొలాల్లో నీటి నిల్వలు పేరుకపోయి రైతులు లబోదిబోమంటున్నారు. ఇండ్లు కూలిన పేదలు అల్లాడుతున్నారు. జిల్లాలో అనేక చెరువులు పొంగిపొర్లుతున్నవి.. చెరువుల కట్టలు తెగే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లు మొత్తం దెబ్బతిన్నవి. పలు కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. అధికార యంత్రాంగం మొత్తం ఖమ్మం మున్నేరు పరీవాహక ప్రాంతం పైనే దృష్టి సారించడంతో జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టడం లేదు.. వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టం అంచనా వేయడం లేదు... మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు మరో రెండు రెండురోజుల పాటు కొనసాగనున్నాయి.. మున్నేరుకు ఆదివారం సాయంత్రం వరద పెరగకపోవడం వల్ల అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. పరీవాహక ప్రాంతాల్లోని పలువురు ప్రజలు గంటగంటకు మున్నేరు నది ప్రవాహాన్ని తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. రెండురోజులుగా మోస్తరు వర్షం మాత్రమే కురవడంతో మున్నేరు పరీవాహక ప్రాంతంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నవి. రోడ్ల క్లీనింగ్, శానిటేషన్, సర్వే పనులు, విద్యుత్ పునరుద్ధరణ లాంటి పనులు శరవేగంగా జరుగుతున్నవి..



ఖమ్మం కాల్వొడ్డులో చెత్తను తీస్తున్న జేసీబీ

### భయపెడుతున్న వర్షం

పదిరోజులుగా జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా ప్రజలు భయంతో వణికిపోతున్నారు. పత్తి, మొక్కజొన్న, వరి, మిర్చితోటలు, కంది, ఉద్యాన పంటలు కూరగాయలు, ఆకుకూరలు అక్కడఅక్కడ బొప్పాయి తోటలు, పండ్ల తోటలు దెబ్బతిన్నాయి.. వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా మేరకు జిల్లావ్యాప్తంగా 60 వేల ఎకరాల్లో పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు నివేదికలు ఇచ్చారు. ఐతే పూర్తిస్థాయిలో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే తప్పుడు లెక్కలు చెబుతున్నట్లు పలువురు రైతుసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇదిలాఉండగా మూడ్రోజుల నుంచి కురుస్తున్న వర్షం జిల్లా ప్రజలను భయపెడుతున్నది.. ఇప్పటికే పలు చెరువులు, రిజర్వాయర్లు నిండుకుండలా ఉండడం, మున్నేరుకు ఎప్పుడు వరద వస్తుందోననే ఆందోళనలో ప్రజలు భయంతో గడుపుతున్నారు.

### ఇంటింటికీ నిత్యావసర సరుకులు అందడం లేదు...

మున్నేరు ముంపు ప్రాంతాల్లోని వెంకటేశ్వర నగర్, పద్మావతినగర్, బొక్కలగడ్డ, ధంసలాపురం, దానవాయిగూడెం కాలనీల్లోని ముంపు ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు తమ ఇండ్లకు చేరలేదని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆయా డివిజన్ నాయకులు వారి పార్టీకి చెందిన వారికే ఇస్తున్నారు కానీ.. ప్రతి ఇంటికి వచ్చి అధికారులు, మున్సిపల్ సిబ్బంది వచ్చి ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. స్వచ్ఛంద సంస్థలు, పలు సంఘాలు, సంస్థలకు చెందిన వ్యక్తులు వచ్చి భోజనం, దుప్పట్లు అందిస్తున్నారని ప్రభుత్వపరంగా ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని పేర్కొంటున్నారు. గ్యాస్‌పొయ్యిలు పదిరోజులైనా వెలగట్లేదు.. నిత్యావసర సరుకులు ఇస్తున్నారు కాని వాటిని వండుకోవడానికి గిన్నెలు కూడా లేవని మరికొంతమంది పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే సహాయం చేయాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వం ఇస్తానన్న పదివేలు కూడా ఇవ్వలేదు.. బ్యాంక్ ఖాతాల నెంబర్లు సేకరించారు కాని వాటిలో డబ్బులు జమకాలేదు.. దీంతో బాధితులు ఇబ్బందుల్లోనే కొట్టుమిట్టాడుతున్నారు.

### కూలిన ఇండ్ల వారికి సాయం లేదు..

మున్నేరు వరదల కారణంగా పరీవాహక ప్రాంతాల్లో అనేక ఇండ్లు దెబ్బతిన్నాయి. స్థానికుల అంచనా మేరకు దాదాపు వందకు పైగానే ఇండ్లు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. కానీ ఈ విషయంలో అధికారులు మాత్రం ఇంతవరకు ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. ఇండ్లు కూలిన వారికి రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇస్తామని జిల్లాకు చెందిన మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లాలో పర్యటిస్తూ చెబుతున్నప్పటికీ ఇంతవరకు అతీలేదు గతీలేదు. పూర్తిగా నిరాశ్రయులైన పేదలు లబోదిబోమంటున్నారు. జిల్లాలోని ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో అనేక ప్రాంతాల్లో ఇండ్లు కూలాయి. ఖమ్మంరూరల్ మండలంలోని రాజీవ్‌గృహకల్ప, కస్నాతండా తదితర చోట్ల ఇండ్లు దెబ్బతిన్న బాధితులు పొంగులేటిని కలిసి విన్నవించినా ఎలాంటి ఫలితం లేదు.

### అల్లాడుతున్న రోజువారీ కూలీలు..

మున్నేరు వాగు పరీవాహక ప్రాంతాల్లో అత్యధికంగా నిరుపేదలే జీవిస్తున్నారు. కూరగాయల మార్కెట్, వ్యవసాయశాఖ మార్కెట్‌లో హమాలీలుగా, గాంధీచౌక్ ప్రాంతంలోని కిరాణా దుకాణాల్లో కూలీలు, సుతార్లు, రాడ్ బెండింగ్, ప్లంబింగ్ పనులు చేసేవారు, మార్బుల్ పనిచేసే కూలీలు, తోపుడు బండ్లపైన పండ్లు, కూరగాయలు, మొక్కజొన్న కంకులు, బజ్జీలు అమ్ముతూ జీవించే వారు అత్యధికంగా ఉన్నారు. వీరందరికి గత పదిరోజులుగా పనులు లేకపోవడం, ఇండ్లన్నీ బురదగా మారడం, ఇంట్లో సామన్లు మొత్తం వరదలో కొట్టుకపోవడం వల్ల వారి జీవితాలు చిన్నాభిన్నంగా మారాయి.

## వరద బాధితులకు అండగా నిలవాలి

- పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి
- వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ



బాధితురాలితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 9 : కష్టాల్లో ఉన్న మున్నేరు వరద బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. జలగంనగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్‌తో కలిసి సోమవారం సాయంత్రం ఆయన పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లకు వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వరద తగ్గిన తర్వాత ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ సహకారాలు, ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. బీఆర్‌ఎస్ పార్టీ సహాయ సహకారాలు అందించడంతోపాటు ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయంపై సైతం కొట్లాడుతుందన్నారు. ఈ సందర్భంగా కందాల, చిరాగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తయారు చేయించిన నిత్యావసర సరుకుల కిట్లను బాధిత కుటుంబాలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మరింత సాయం చేసి ముంపు బాధితులకు మనోధైర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మున్నేరుకు ఇరువైపులా రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.650 కోట్లు మంజూరు చేయడంతోపాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిందన్నారు. ఆ పనులను ప్రభుత్వం వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుడా మాజీ డైరెక్టర్ గూడ సంజీవరెడ్డి, సొసైటీ చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్, పార్టీ మండల కార్యదర్శి పేరం వెంకటేశ్వర్లు, నేలకొండపల్లి బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, నాయకులు ముత్యం కృష్ణారావు, దర్గయ్య, అక్కినపల్లి వెంకన్న, వీరభద్రం, శ్రీను, నాగేశ్వరరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

### పట్టించుకునే వారే లేరు..



ఇల్లు అంతా మునిగి లక్షల రూపాయాలు నష్టపోయాం.. ఇంతవరకు ప్రభుత్వం ఆదుకోలేదు.. ఏదో మా మొఖాన నాలుగు సరుకులు ఇచ్చి మా చావుకు మమ్మల్ని వదిలేశారు.. ప్రభుత్వానికి బాధ్యత లేదా? సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిండు, పోయిండు. పదివేలు ఇస్తామన్నారు.. ఇంతవరకు అతీలేదు.. గతీలేదు. ఎవరూ పట్టించుకోరు. ఓట్లప్పుడు వచ్చి అదిచేస్తాం.. ఇది చేస్తాం అంటారు.. కానీ ఇబ్బందుల్లో ఉంటే మాత్రం ఎవరూ రారు.

– ఆకునూరి సునీత, మోతీనగర్, ఖమ్మం నగరం

### పదివేలు ఇంకా ఇవ్వనే లేదు..



మునిగిన ప్రతి ఇంటికి పదివేలు ఇస్తానని చెప్పారు. ఇప్పటి వరకు రూపాయి కూడా ఇవ్వలేదు. బ్యాంక్ అకౌంట్ నెంబర్ తీసుకున్నరు ఇంకా డబ్బులు రాలేదు. ఏదో నాలుగు సరుకులు మాత్రం ఇస్తున్నారు. వాటితో ఎలా బతుకుతాం.. ప్రభుత్వానికి బాధ్యత లేదా.. మాటలు మాత్రం చాలా గొప్పగా చెబుతారుగా.. సాయం ఎందుకు చేయరు.. మా సొమ్ము మాకు ఇవ్వడానికి ఇబ్బందులు ఎందుకు?

– మహమూద్, కాల్వొడ్డు, ఖమ్మం నగరం

### పదివేలు దేనికి సరిపోతాయి..



రేవంత్‌రెడ్డి పదివేలు ఇస్తానని అన్నాడు.. అవి దేనికి సరిపోతాయి.. ఇంట్లో వస్తువులు అన్ని పాడైపోయాయి.. కష్టపడి ఏడాదికొకటి కొనుక్కున్నాం.. వాల్లు ఇచ్చే పదివేలు దేనికి సరిపోతాయి.. క్వింటాళ్ల కొద్దీ బియ్యం తడిసిపోయాయి. పదిరోజులైనా గ్యాస్ ముట్టించలేదు. ఆకలితో అలమటిస్తున్నాం.. తిండి పెట్టేవాడు లేడు నీళ్లు ఇచ్చే వాడు లేడు.. చీకటిలో మగ్గుతున్నాం.

– ఉమ్మనేని ఈశ్వరమ్మ, బొక్కలగడ్డ, ఖమ్మం నగరం

### మాకు దిక్కెవరయ్యా..



ప్రాణాలు తప్ప మాకు మిగిలేదేమీ లేదు.. మాకు దిక్కెవరయ్యా.. పదిరోజులైనా ఇంట్లో అన్నం లేదు.. తాగడానికి నీరు రావట్లేదు.. వరద వస్తుందని ముందే చెప్పినా మా వస్తువులు మేము కాపాడుకొనేవాళ్లం.. కానీ ఏ ఒక్కరు కూడా చెప్పలేదు.. ప్రాణాలు పోతాయేమోనని భయపడ్డాం. కానీ దేవుడి దయ వల్ల ప్రాణాలు మాత్రం పోలేదు.. ఆస్తులు పోయాయి.

– మేడబోయిన ఉషారాణి, వెంకటేశ్వరనగర్, ఖమ్మం నగరం

### ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలి



ప్రభుత్వం ఉంది ప్రజల కోసమే కదా.. మీము ఓట్లు వేస్తే గద్దెమీద కూర్చున్నారు. మాకు కష్టం వస్తే మాత్రం ఎవరూ ఆదుకోరా.. రూపాయి కూడా సాయం చేయలేదు. పోయిన ఏడాది ఇదేవిధంగా వరదలు వస్తే మాకు ఎలాంటి నష్టం జరగలేదు. వస్తువులకు ఏమి కాలేదు.. రాత్రికి రాత్రే రాజమండ్రి నుంచి బోటింగ్ వాళ్లను రప్పించి మాకు రక్షణగా నిలిచారు.

– ధరావత్ జ్యోతి, కాల్వొడ్డు, ఖమ్మం నగరం

## వరద బాధితులకు 'పగడాల' చేయూత

270 కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేస్తున్న పగడాల నాగరాజు

ఖమ్మం, సెప్టెంబర్ 9 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయిన ఖమ్మం నగర బాధితులకు బీఆర్‌ఎస్ పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు చేయూతనిచ్చారు. ఖమ్మం నగరంలోని 46, 30, 4, 17, 34వ డివిజన్ల పరిధిలో 270 మంది కుటుంబాలకు సుమారు 2 లక్షల 30వేల రూపాయల విలువచేసే నిత్యావసర సరుకుల కిట్లను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో బీఆర్‌ఎస్ నాయకత్వం ఇప్పటికే 10వేల మందికి నిత్యావసర సరుకులు అందించినట్లు తెలిపారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపుమేరకు వరద బాధితులకు సరుకులను స్వతహాగా పగడాల నాగరాజు, కూరాకుల నాగభూషణం అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముక్కాల కమల, కన్నం వైష్ణవి ప్రసన్న, దండా జ్యోతిరెడ్డి, నాయకులు కోడి లింగయ్య, బొల్లేపల్లి విజయ్, సారిక రాము, మధు, మేడిదెల మల్లేష్, భిక్షం, సుబ్బాచారి పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్ల జారీకి చర్యలు

- 72 బృందాలు 10రోజులపాటు దరఖాస్తుల స్వీకరణ
- ఎలాంటి రుసుం లేకుండా అందజేస్తాం : కలెక్టర్

ఖమ్మం, సెప్టెంబర్ 9 : ముంపు ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల వల్ల సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్లు పోగొట్టుకున్న వారికి 'నా ఖమ్మం కోసం నేను' కార్యక్రమంలో భాగంగా సర్టిఫికెట్ల జారీకి చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సర్టిఫికెట్ల జారీకి చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలతో సామగ్రితోపాటు సర్టిఫికెట్లు, పత్రాలు పోగొట్టుకున్న ముంపు ప్రాంతాల వారికి సర్టిఫికెట్ల, పత్రాల జారీకి పకడ్బందీ కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ నిమిత్తం ఖమ్మం నగరపాలక సంస్థ పరిధి మినహాయించి, సత్తుపల్లి, వైరా, మధిర పట్టణ ప్రాంతాల్లో 72 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. బృందాలు ముంపు ప్రాంతాల్లో పర్యటించి దరఖాస్తులు స్వీకరిస్తాయన్నారు. ఇంటి యజమాని నుంచి దరఖాస్తుల స్వీకరణలో భాగంగా తమకు, తమ పిల్లలకు సంబంధించిన సర్టిఫికెట్ల వివరాలు దరఖాస్తులో పొందుపర్చాలని కోరారు. ఆ వివరాల ఆధారంగా సంబంధిత శాఖల అధికారులతో సర్టిఫికెట్ల జారీకి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ 10రోజులపాటు చేపడతామన్నారు. సర్టిఫికెట్ల జారీకి మీ సేవ, ధరణి, ఇతరత్రా రుసుము, లామినేషన్ ఖర్చు అంతా ప్రభుత్వమే చెల్లిస్తుందని, ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. విదేశాల్లో అడ్మిషన్లు, ఉపాధి తదితర అత్యవసర అవసరాల ఉన్నవారు తమ హాట్ లైన్ నెంబర్ తెలియజేస్తూ, టోల్ ఫ్రీ నెంబర్ 1077కి సంప్రదించాలని, 9063211298 నెంబర్‌కి వాట్సాప్ ద్వారా అత్యవసరానికి సంబంధించి రుజువులు సమర్పించాలన్నారు. ఇట్టి వారికి ప్రావిజనల్ సర్టిఫికెట్లు వారంలో అందజేసేలా చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్, డీఈవో, డీఐఈవో పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్